# ★ విచిత్ర ఘటన ★

శ్రీమతి బాపట్ల సుశీలగారు

అరుణ కాంతులు వెదజిమ్మే చక్కని సాయం సమయం. అప్పుడే తలంటిపోసుకొని మేడమీద నిలుచుని తల వెంట్రుకలు చిక్కుదీసుకుంటున్నాను. చల్లనిగాలి మెల్లగా వీస్తూ ఆరిననాళల నీలాలను అల్ల నల్లన నృత్యం చేయిస్తూంది. మందమారుతం తాకిడికి ముఖంమీద పడుతున్న కేశములు సవరించుకోవడంతో నాపని సరిపోతోంది. మనసు నిర్మల నీలాకాశంలా ఉంది. తలంటి పోసుకున్న తరువాత సంధ్యా సమయం, గాలివీవనలు కలిగించే ఆనందం ఊహించుకోవాలసిందే లేదా అనుభవించవలసిందే తప్ప, వర్ణించడం కష్టమైన విషయం.

దీనికితోడు గదిలో రేడియో మధురంగా సంగీతం- ఆలాపిస్తోంది. ఆసమయాన ఎందుకో ఏమో తెలియని ఆనందం నాహృదయంలో చెలరేగిపోతూంది. నేనే కాదు ఆలాంటి సమయం ఏమెత్తని హృదయానికైనా ఆనందాన్నిస్తుంది. ఆనాడు నాలేత హృదయమైనా ఆనంద డోలికలో ఊగులాడుతూ ఉక్కిరి బిక్కిరై పోయింది.

మాచెల్లెలు, లలిత ఎనిమిదేండ్లపిల్ల నన్ను చూచి,

"అక్కా ఇప్పుడు ఎంత బావున్నావు?" అంది.

"ఛీ! వూరుకో పిచ్చిపిల్ల" అన్నాను.

"నిజంగా అక్కా ఎంతబావున్నావు అనుకోన్నావు?" అన్నది మళ్లీ.

"లలితా; నిజంగా బాగున్నానా?" అన్నాను ప్రశ్నించకుండా వుండలేకపోయి.

"అవునక్కా బలేబాగున్నావు" అంది లలిత.

"అయితే బాగుండడం మంటే ఏమిటీ?"

"అత్త చెప్పలేదు తలంటి పోసుకుని కొత్తదుస్తులు వేసుకుంటే ఎంతోబాగుంటారని"

"ఓహో అదా విషయం?" అన్నాను.

"అక్కా నేనాడుకుంటానికి కిందకు పోతా" అంది.

"వెళ్లుమరి బజారులోకి వెళ్లకేం, కార్లువస్తాయ్" అన్నాను.

నామాట విని వినకుండానే లలిత మెట్లుదిగుతూ పరిగెత్తుకుంటూ పోయింది. చిన్నపిల్ల ఏడాది నిండలేదు మాతల్లి చనిపోయింది. అప్పటినుండి నేనే దానికి తల్లినీ అక్కను;

అద్దంముందు నిలుచుని నన్ను నేనే చూచుకుంటూ నాలో నేను మురిసిపోయాను; ఏమైనా ఎంత కాలమో ఇంకా ఈ ఏకాకిజీవితం? నాహృదయంలో కోరికలు ఎప్పుడు ఫలించడం? నాహృదయానికి ఏహృదయం జంటగాబోతుందో! అతని మనస్తత్వం ఏలాటిదో! మగవాళ్లలోకూడా చాలా తరహాల తత్వాలుగల వాళ్లుండరూ? మృదువైన హృదయం, మధుర భావాలు, సున్నితమైన మనస్తత్వం విశాల మనస్సు కలిగిఉండే వ్యక్తి నాకు లభ్యమయితే నామనోరథం ఈడేరుతుంది. అప్పుడిక నా అదృష్టమే అదృష్టం అని అనుకుంటూండగానే లలిత పరుగెత్తుకుంటూ వచ్చి-

"అక్కా! అక్కా! ఎవరో వచ్చారు" అన్నది.

"ఎవరే!" అన్నాను.

"ఏమో ఎవరో నాకేం తెలుసు" అన్నది లలిత.

"ఏరే ఎక్కడ?" అన్నాను.

"బయటే వున్నారు."

పిట్టగోడదాకా వెళ్ళి క్రిందికి తొంగిచూచాను. పైజామా, గుజరాతి తరహా లాల్చీ, రేగిన క్రాపు, అలసిపోయినట్లు కానవస్తున్న ముఖం, అయినా ఎందుకో చూడాలనిపిస్తోంది. త్వర త్వరగా క్రిందికి దిగివచ్చి తలుపు తెరిచా;

"ఇంట్లో ఎవరున్నారండీ?" అన్నాడు. చక్కని సంస్కారం ఉట్టిపడింది ఆమాటలలో.

"ఏంకావాలండీ?"

"మీనాన్నగారు వున్నారా?" అన్నాడు.

అబ్బా! ఆమాటలో ఎంతతీపి వుంది.

"లేరు; ఇప్పుడే బజారుకు వెళ్లారు" అన్నాను ఆదోవిధంగా.

"ఎప్పుడు వస్తారో?" అన్నాడు నిరాశభావాన్ని సూచిస్తూ.

"వచ్చేస్తారు. ఎందుకు?"

"అద్దెకిచ్చే పోర్షన్ ఖాళీగా ఉందటకదూ?"

"ఉంది, మీరెవరు. ఉద్యోగం ఎక్కడ?" అడిగాను నాన్నగారి తరఫున వకాలత పుచ్చుకున్నట్లు.

"ఇక్కడే ఉద్యోగం చేస్తున్నాను" అన్నాడు. నాప్రశ్నలన్నిటికీ ఒకటే సమాధానం మన్నట్లు.

"సరే! నాన్నగారిని అడగండి" అన్నాను, ఇక సంభాషణ ఆపాలన్నట్లు.

"మళ్లీవస్తాను. మీనాన్నగారు వస్తేచెప్పండి" అని వెళ్లిపోయాడు.

ఏవో ఆలోచనలు మనసులో అలముకుంటున్నాయి. ఎందుకో ఆనందం అధిక మవుతూంది. హృదయం పొంగిపోతూంది. సరే! ఇదేమిటి, కారణం లేకుండానే ఏమిటీ మనోవికాసం? ఏమో, ఏమిటో నాకేమీ అర్థం కాలేదు.

"కమలా!" అని నాన్నగొంతు బయటనుంచి వినవచ్చింది. అతనుకూడా వస్తున్నాడేమోనని కిటికీలోంచి తొంగిచూశా. ఊహూ; నాన్న ఒక్కరే.

"నాన్నా! నాన్నా! ఇపుడే మనయింటికి ఎవరో వచ్చిపోయారు నాన్నా" అన్నది లలిత.

"కమలా! ఎవరు వచ్చారు?" అన్నారు నాన్న.

"ఎవరో నాన్నా ఇక్కడ ఉద్యోగమట, ఇల్లు అద్దెకు కావాలని వచ్చారు."

"ఏడీ?" అన్నారు నాన్న.

"మీరువచ్చాక రమ్మని చెప్పా నాన్న."

"సరే! కావలిస్తే మళ్లీ అతడేవస్తాడు."

రాత్రి 8 గంటలకు నాన్నగారు భోజనం చేసి మేడమీద వాలుకుర్చీలో పడుకున్నారు. నేను అప్పుడే వీణమీటుతూ వున్నాను. కాని మనస్సులో వచ్చి వెళ్లిన ఆపురుషుని వెంగమే తాండవిస్తూఉంది.

ప్రతిదినము ఎంతమందిని చూడడంలేదు? ఇతని మొగమే నన్నంతగా ఆకర్షించడానికి కారణమేమి? అని నేను అనుకుంటూ ఉండగా వీధితలుపు కొట్టిన చప్పుడైనది. మా లలితవెళ్లి తలుపుతీసింది. ఆపురుషుడే వచ్చాడు.

"లలితా! వారిని నాన్నగారి వద్దకు తీసుకొని వెళ్లు నేనూ ఇప్పుడే వస్తాను" అని వడి వడిగా తలదువ్వుకొని చీర సవరించుకొని మేడమీదికి వెళ్లి మా నాన్నగారి వెనుకను ఆపురుషుని కెదురుగా నిలబడ్డాను. అతని మొగము మరింత ఆకర్షణీయముగా కనబడినది.

"కమలా! మనం అద్దెకివ్వదలచుకొన్న భాగం వీరికొకసారి చూపించమ్మా" అన్నారు నాన్నగారు.

వారిని మేడదిగువకు తీసుకొనివెళ్లి ఇవ్వదలచుకొన్న రెండుగదులు, వంట ఇల్లు, వసారా చూపించాను. ఎలెక్ట్రిక్ దీపాలన్ని గదులకు వున్నవి.

చూపిస్తూ ఉన్నప్పుడే.

"మీ పేరండీ" అన్నాను.

"పురుషోత్తమరావు"

"మీకుటుంబమంతా ఎందరు?"

"ప్రస్తుతం నేనొక్కణ్ణే. కాని ఒకనెలలో నాభార్య చంటిబిడ్డను తీసుకొని వస్తుంది. తోడుగా మా అత్తగారు, మరదలు వస్తారనుకుంటాను. వచ్చినా వారు పదిరోజులుండి వెడతారు;"

"మీ ఉద్యోగం? - అడగవచ్చునా?"

"అయ్యోదానికేం? నేను గవర్నమెంటు కాలేజిలో హిస్టరీ లెక్చరరును. జీతం 200 లు."

"చాలా సంతోషం; మీకిదే మొదటి సంతానమా?"

"అవునండీ, నాకు వివాహమయి రెండేండ్లే అయినది. అద్దె ఎంతండి!"

"30 రూపాయలండి. దీపాలకు మూడు మూడున్నర కావచ్చు. రేడియో, టేబిల్ ఫాన్ పెట్టుకుంటె కొంచెము అధికమవుతుంది."

"బాగానే ఉంది. అడ్వాన్స్ ఇవ్వాలా?"

"మామూలే, ఒకమాసం అడ్వాన్సు 30 రూ. లు"

"మంచిది."

ఈ మాటలాడుకుంటూ మళ్లీ నాన్నగారివద్దకు వెళ్లాం. మాటలాడుతూ ఉన్నంతసేపు పురుషోత్తమరావుగారు అతి జాగ్రత్తగా చూస్తూ మాటలాడుతూ వచ్చారు. కంఠం అతిమధురంగా ఉంది. చక్కగా పాడగలవారిలాగు తోచింది.

"రేపే మంచిరోజు దిగుతాను. అడ్వాన్స్ ఇందండి" అని 30 రూపాయలు జేబులోనుంచితీసి మా నాన్నగారిచేతికిచ్చారు.

"రసీదు కావలెనా?"

"ఇద్దరుగానిలెండి. తొందరలేదు. రేపు ఉదయం 8 గంటలకు ముహూర్తం మంచిది. ప్రవేశిస్తాను." అని చెప్పి వెళ్లిపోయారు.

పెండ్లి అయినదని అతడు చెప్పగానే నా ఉత్సాహం క్రుంగిపోయింది. అయినా వారు మాయింట్లో కాపురముండాలన్న కోరిక తగ్గిపోలేదు.

పురుషోత్తమరావుగారు రాకముందే గదులు శుభ్రంగా తుడిపించి ఉంచాను. నేనూ లలితా వారి సామానులు తీర్చిదిద్దినట్లు అమర్చి పెడుతున్నాం.

“మీకెందుకండీ ఈ శ్రమ నేను నౌకరిని కుదుర్చుకున్నాను. వాడువచ్చి చేస్తాడు. సరే రానీండి” అంటూ మా పనిమేము చేశాము. సామానులలో హార్మోనియమ్, వీణ కనబడగానే వీరు సంగీతం తెలిసినవారన్న ఊహ స్థిరబడింది.



ప్రతిదినం వారు ఉదయాన్నే లేచి 6 గం॥నుండి 7½ గం॥ వరకున్న వీణవాయిస్తూ పాడుతూ ఉంటే, నేనూలలితా సరదాగా గుమ్మం ప్రక్కను కూర్చుండే వింటూ ఉండే వాళ్లం. చనువు ఎక్కువయిన తర్వాత వారిగదిలోనికేపోయి కూర్చుండేవాళ్లం. నేనూ లలితా పాడగలమన్న సంగతి తెలియగనే, మాచేతను పాడించి స్వరంలోను లయలోను ఉన్నలోపాలు దిద్దుతూ మమ్ము హెచ్చరించేవారు పురుషోత్తమ రావుగారు.

వారి యెడల పట్టరాని మోహం కలుగుతూ వచ్చింది నాకు. ఒకప్పుడు రాత్రికూడా వీణ వాయిస్తూ పాడేవారు రావుగారు. లలిత కొంత సేపటికి నిద్రపోయేది. మా నాన్నగారు మేడదిగి వచ్చేవారుకారు. మా వంటలక్క మా తల్లిపోయినప్పటినుండీ తల్లివలె పెద్దదిక్కుగా ఉండేది. ఆమె ప్రక్కనే నేనూ లలితా పడుకునేవారం.

“10½ గం॥ల రాత్రి అయింది. ఇకవచ్చి పడుకో కమలా !” అనేది మా వంటలక్క రమణమ్మ.

“నువ్వుపడుకో రమణమ్మా నీకు నిద్రవస్తే” అనేదానను.

ఆమె ఏమో గొణుగుకుంటూ పడుకొనేది. పురుషోత్తమరావుగారుకూడా వీణ క్రిందపెట్టి, “ఇక పడుకోండి” అనేవారు. నాబలవంతాన మరియొకపాటపాడి ముగించేవారు.

ఇలా ఒక నెల గడచింది. నా హృదయంలో వింత వింత భావాలు పుట్టుకొని వస్తున్నాయి. రావుగారిని చూచినకొద్దీ ఆదరం అనురాగం గౌరవం ఎక్కువగుతున్నవి. మోహం మాత్రము తగ్గింది. కాని పూర్తిగాపోలేదు. నామాటలలోను చూపులలోను నాహృదయభావం వారికి అందజేశానేమో కూడాను. కాని రావుగారు మాత్రము నాచిన్న చెల్లెలు ఎనిమిదేండ్ల పిల్లను - లలితను ఎట్లు చూచారో అట్లే నన్నూ చూస్తూ వచ్చారు. స్వేచ్ఛగానే కులాసాగానే మాట్లాడేవారు. కాని నేను ఆశించే భావంతో ఎన్నడూ మాట్లాడలేదు.

ఒకనాడు, "కమలాదేవిగారూ!" అంటూ రావుగారు తన భార్య నాకు వ్రాసిన ఉత్తరం నాచేతికిచ్చారు. విప్పి చూచాను. "వదినగారికి నమస్కారములు. మీ అన్నగారు మీ ఆదరం సుగుణ సంపత్తి అంతా తెలియజేశారు. మిమ్మలిని ఎప్పుడు చూస్తానా అని ఉవ్విళ్ళూర్తూన్నాను. వచ్చేవారం దశమినాడు బయలుదేరి వస్తున్నాను" అని ఉన్నది.

ఆ లేఖ చూడగానే పైకి ఆనందిస్తూ ఉన్నట్లు మొగంపెట్టి నవ్వుతూ, "బాగుంది" అన్నానుగాని లోలోపల మాత్రం పట్టరాని ఆవేదన పొందాను. కుమిలిపోయాను. వెంటనే ఏదోపని ఉన్నట్లు నటించి గదిలోకిపోయి తలుపు బిడాయించి, ఏడ్చాను. ఓదార్చుకొన్నాను; బోధపరుచుకొన్నాను.

రావుగారిభార్య రాజ్యలక్ష్మీదేవిగారు చంటిబిడ్డ నెత్తుకొని వచ్చారు. ఆమెతో ఆమె అన్నగారు రామారావుగారు వచ్చారు. ఇంట్లో అంతా సందడిగా ఉన్నది. రామారావుగారు అప్పుడే బి. ఎ అయి, ఉద్యోగం సంపాదించుకోడంకోసం మద్రాస్ వచ్చారు.

వచ్చిన వారంరోజులలోనే బ్యాంకులో ఉద్యోగం దొరికింది. స్ఫురద్రూపి, మితభాషి, నాతో చెప్పకుండానే అతనికి నామీద ప్రేమ పుట్టిస్తున్నారు రావుగారున్నూ, రాజ్యలక్ష్మీదేవిగారున్నూ.

ఒకనాడు మానాన్నగారు మేడమీద లేనిసమయంలో పురుషోత్తమరావుగారు నన్ను మేడమీదికి రమ్మని పిలిచి, "కమలాదేవీ! నేను నిన్ను సోదరిగా భావించి ఒక విషయం చెప్తాను. మరియొకలాగున భావించకవిను. నీసుగుణసంపత్తి - అందులో నీ సౌహార్దము బాగుగా గుర్తించాను. నీ దౌర్బల్యముకూడా నేను గుర్తించకపోలేదు. నేనుకూడా ఆ దౌర్బల్యానికి లోబడియుంటే, మన ఇద్దరి జీవితాలున్నూ పాడయి పోవును. నాభార్య సోదరుడు మంచి తెలివితేటలుగలవాడు, అందమయినవాడు. అతనికి నిన్ను వివాహం చేసుకోవాలనిఉంది. నీకిష్టమయితే మీనాన్నగారితో చెప్తాను" అన్నారు రావుగారు.

నేను మారుమాటాడలేకపోయాను. "రావుగారూ! నామనసు స్థిరపరచుకోలేకుండా ఉన్నాను. రేపు చెప్తాను. అంతవరకు ఆలోచించుకోడానికి అవకాశమీయండి" అన్నాను.

"అలాగేనమ్మా" అన్నారు.

ఆ మరునాడు నేను రావుగారిని మేడమీదికి తీసుకొనిపోయి, "మీరు నాకు చేసినమేలు ఇంతంత కాదు. నేను సరిగా చెప్పలేకుండా ఉన్నాను. నాశీలం చెడిపోకుండా కాపాడారు. కాపాడుకో డానికి అవకాశం ఇచ్చారు. కోరికోరనట్లు ఫలమందించారు. నాకు వాస్తవంగా మీరు సోదరులు. నా యెడల మీకుగల ఈ సౌభ్రాత్రం, సద్భావం కలకాలం నిలపండి" అన్నాను.

అంతా విజయవంతంగా, శుభప్రదంగా జరిగింది. ఇదియొక విచిత్రఘటన.

---